

దార్శనికుడు గురజాడ

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 21: తెలుగు జాతికి వెలుగుదారి చూపిన దార్శనికుడు గురుజాడ అప్పారావు అని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ కొనియాడారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన గురుజాడ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. గురుజాడ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. సమాజంలో చైతన్యాన్ని రగిలించిన సాహిత్య ఉద్యమకారుడు, సంఘ సంస్కర్త గురజాడ అని కలెక్టర్ అన్నారు. తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు ఆయన ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఎక్కడికి వెళ్లినా, ఎక్కడ ఉన్నా మన ఊరు, మన భాష గురించి మాట్లాడి.. ప్రతిష్ఠను పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో రామకృష్ణారెడ్డి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన



నిరసన తెలుపుతున్న వైద్యులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 21: ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 55కు వ్యతిరేకంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు ఆందోళనబాట పట్టారు. జిల్లాలో 45 పీహెచ్‌సీలలో 110 మంది డాక్టర్లు పని చేస్తుండగా 105 మంది సమ్మెబాట పట్టారు. గత వారం రోజులుగా పీహెచ్‌సీలలో ఉంటూ సీరియస్ కేసులకు వైద్యసేవలు అందిస్తూ వచ్చా రు. అయితే శనివారం నుంచి ఆందోళన ఉధృతం చేశారు. జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి చేరుకొని వైద్య సేవలు పూర్తిగా బంద్ చేసి ఆందోళన కొనసాగిస్తామని డీఎంహెచ్‌ఓకు నోటీస్ ఇచ్చారు. అనంతరం డీఎంహెచ్‌ఓ ఆఫీస్ వద్ద జీఓ 55ను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని నినాదాలు చేపట్టారు. వీరి ఆందోళనకు ఏపీఎంఎల్‌టీ సంఘం మద్దతు తెలిపింది. పీహెచ్‌సీల డాక్టర్లు సమ్మెబాట పట్టడంతో వైద్యశాఖలో ఆందోళన మొదలైంది.

రైళ్లలో వెరైటీ దొంగలు

సెల్‌ఫోన్లు చోరీ చేసి.. మోసాలు

ముగ్గురిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు



నిందితులను చూపుతున్న రైల్వే పోలీసులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 21: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డారు. పందెం కాసే డబ్బులకోసం పక్కదారి పట్టారు. రైళ్లలో నిద్రిస్తున్న ప్రయాణికుల సెల్‌ఫోన్లను చోరీ చేసి.. ఆ తరువాత రైల్వే పోలీసుల తరహాలో ఫోన్ చేసేవారు. 'మీ ఫోన్ దొరికింది. ఇది మీదేనా..? కన్ఫర్మేషన్ కోసం పాస్‌వర్డ్ చెప్పండి..' అని నమ్మించి.. లాగిన్ అయ్యేవారు. ఆ మొబైల్ ఫోన్‌లోని వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా కాంటాక్ట్ నంబర్ల నుంచి వివిధ కారణాలు చూపి డబ్బులు అడిగేవారు. బెట్టింగ్ క్యూఆర్ కోడ్‌లు పంపించి.. డబ్బులు వేయించుకునేవారు. బెట్టింగ్‌లో సంపాదించిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. రైల్వే పోలీసులు ఈ ముఠా ఆటను కట్టించారు. క్రిష్ణమరెడ్డిపల్లికి చెందిన మాచినేని సంతోష్ కుమార్, కలగళ్లకు చెందిన కోమలి వినయ్‌కుమార్‌రెడ్డి, కడప జిల్లా సింహాద్రిపురం మండలం కుమ్మరంపల్లికి చెందిన భూక్యా సునీల్ కుమార్ నాయక్‌ను శనివారం అరెస్టు చేశారు. నగరంలోని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ విజయకుమార్ ఈ కేసు వివరాలను తెలిపారు. నిందితుల నుంచి 5 సెల్‌ఫోన్‌లు, రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. రైల్వే ప్రయాణికులు ఇలాంటి మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు.

రేపు చేనేతల మహాధర్నా

యాడికి, సెప్టెంబరు 21: చేనేతల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న తహసీల్దారు కార్యాలయం వద్ద 'చేనేతల మహాధర్నా' నిర్వహిస్తున్నామని జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మామిళ్ల నారాయణస్వామి తెలిపారు. యాడికిలో శనివారం నిర్వహించిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు మాస్టర్ వీవర్స్ పని కల్పించడం లేదని, కూలి డబ్బులు సరిగా ఇవ్వడం లేదని అన్నారు. నేతన్న నేస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి చేనేత కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని అన్నారు. యాడికిలో పట్టురాయితీ కేంద్రాలను ఏర్పాటు చేసి, కార్మికులను ఆదుకోవాలని కోరారు. చేనేతలు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి కేశవ్

మీ సేవకుడిని

● మంత్రి పయ్యావుల

విడపనకల్లు, సెప్టెంబరు 21: నియోజకవర్గ ప్రజలకు తాను సేవకుడినని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. తనను 30 ఏళ్లుగా ఆదరిస్తున్నారని, ఇప్పుడు ఇంత ఉన్నత స్థానాన్ని ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. గడేకల్లులో శనివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హెచ్చెల్సీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు ఇప్పించి పంటలను కాపాడుతానని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లను, డ్రైనేజీ కాల్వలను ఏర్పాటు చేయిస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి గడేకల్లు జాతీయ రహదారి పనులను పూర్తి చేయిస్తామని అన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. అంతకు మునుపు మహిళలు ఆయనకు హారతిపట్టి స్వాగతించారు. స్థానిక భీమలింగేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామం లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. ఆర్ కొట్టాల, అంచనహాలు, గడేకల్లు టీడీపీ నాయకులు మంత్రిని గజమాలతో సత్కరించారు.

వైద్యం వికటించి యువకుడి మృతి

ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 21: వైద్యం వికటించి కర్నూలు సహస్ర హాస్పిటల్‌లో వజ్రకరూరు మండలం పందికుంటకు చెందిన అనిల్(38) మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. పేగు మడత పడిందని ఆస్పత్రికి వెళ్లిన అనిల్‌ను వైద్యులు అడ్మిట్ చేసుకుని ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత అనిల్ మృతి చెందాడు. బంధువులు ఆందోళనతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. ఆందోళనను అడ్డుకునేందుకు చూసిన త్రీటౌన్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎన్టీఆర్ వైద్య సేవ ఉన్నా ఆస్పత్రిలో డబ్బులు వసూలు చేశారని మండిపడ్డారు. వివాదం నేపథ్యంలో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.



26 తరువాతే రిలీవ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు21: ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ఈనెల 26 తరువాతే రిలీవ్ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా డీపీఓలకు కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అక్కడ ఉన్న సిబ్బంది రిలీవ్ అయితే గందరగోళం నెలకొనే పరిస్థితి ఉంది. దీంతో ఈకార్యక్రమం పూర్తి అయిన తరువాతే పాత స్థానాల నుంచి రిలీవ్ చేస్తామని డీపీఓ ప్రభాకర్‌రావు తెలిపారు.

ఈ ఒక్క రోజే..!

దులీప్ ట్రోఫీ పోటీలు చివరిరోజుకు చేరాయి. అనంత ఆర్డీటీ మైదానాల్లో (ఏసీజీ-ఎ, బి) ఈనెల 5న మొదలైన జాతీయస్థాయి పోటీలను తిలకించేందుకు అభిమానులు పోటెత్తారు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టార్ ఆటగాళ్లను ప్రత్యక్షంగా చూడగలిగారు. వారి ఆటను ఆస్వాదించారు. చివరి రోజు ఆదివారం రెండు మ్యాచ్‌లు డ్రా అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. స్టార్ ఆటగాడు రికీ భుయ్ సెంచరీకి మరో 10 పరుగుల దూరంలో ఉన్నందున.. ఆరంభంలోనే వెళ్లే ప్రేక్షకులు ఈ ఫీట్‌ను చూసే అవకాశం ఉంటుంది.

- అలరించిన దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు
- ఆదివారం.. ప్రేక్షకులకు డ్రానందమే..!
- సెంచరీకి చేరువలో రికీ భుయ్
- బి-జట్టును ఆదుకున్న వాషింగ్టన్ సుందర్



వాషింగ్టన్ సుందర్ (87)



రికీ భుయ్ (90 నాటౌట్)

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 21: దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీల్లో మూడో రోజు ఇండియా-డి ఆటగాడు రికీ భుయ్ 90 పరుగులు సాధించి.. సెంచరీకి చేరువయ్యాడు. బి జట్టు ఆటగాడు వాషింగ్టన్ సుందర్ 87 పరులతో రాణించాడు. అనంతపురం ఆర్డీటీ మైదానంలో ఓవర్‌నైట్ స్కోర్ 216-7తో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇండియా-సి జట్టు మరో 18 పరుగులు మాత్రమే జోడించించింది. 34 పరుగులతో ఇన్నింగ్స్ ఆరంభించిన పల్కిత్‌నారంగ్ కేవలం 7 పరుగులు జోడించి 41 పరుగులకు ఔట్ అయ్యాడు. వైశాక్ విజయ్‌కుమార్ 4 పరుగులు జోడించి 18 పరుగులకు వెనుదిరిగాడు. రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన బాబా ఇంద్రజిత్(34) తిరిగి బ్యాటింగ్‌కు రాకపోవడంతో జట్టు స్కోరు 234 పరుగులకు పరిమితమైంది. ఇండియా-ఎ బౌలర్లలో ఆవేశ్‌ఖాన్, అఖీబ్‌ఖాన్ చెరో మూడు వికెట్లు, శాంస్‌ములానీ 2, తనుష్ కొటియాన్ వికెట్ తీసుకున్నారు. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా-ఎ జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 270 పరుగులకు 6 వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు ప్రథమ్‌సింగ్ 11 పరుగులు, మయాంక్ అగర్వాల్ 34 పరుగులు, తిలక్‌వర్మ 19 పరుగులు సాధించారు. రియాన్ పరాగ్ 73 పరుగులు, శషావత్ రావత్ 53 పరుగులతో రాణించారు. శాంస్‌ములానీ 8 పరుగులు మాత్రమే చేశారు. కుమార్ కషర్గ 40 పరుగులు, తనుష్‌కొటియాన్ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇండియా-సి బౌలర్లు అన్షుల్ కాంబోజ్, గౌరవ్ యాదవ్, మానవ్‌సుతార్ చెరో 2వికెట్లు తీశారు. ఇండియా-ఎ జట్టు ఆధిక్యం 333 పరుగులకు చేరింది. చేతిలో మరో నాలుగు వికెట్లు ఉన్నాయి.

శతకానికి చేరువలో..

ఓవర్‌నైట్ స్కోర్ 210-6తో మూడోరోజు ఆట ఆరంభించిన ఇండియా-బి జట్టు మరో 62 పరుగులు జోడించి 282 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 39 పరుగులతో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన వాషింగ్టన్ సుందర్ మరో 48 పరుగులు జోడించి 87పరుగులు చేసి ఔట్ అయ్యాడు. రాహుల్ చాహర్ 9 పరుగులు, నవదీప్ సైనీ 7, మోహిత్ అవస్తి 8 పరుగులు చేశారు. వాషింగ్టన్ సుందర్ జట్టుకు గౌరవ ప్రదమైన స్కోర్‌ను అందించి అండగా నిలిచాడు. ఇండియా-డి బౌలర్లలో సౌరభకుమార్ 5 వికెట్లు, అర్షదీప్ సింగ్ 3 వికెట్లు, ఠాకరే 2 వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా-డి జట్టులో ఓపెనర్లు దేవ్‌దత్తు పడిక్కిల్ 2, కేఎస్ భరత్ 2 పరుగులు చేసి వెనుతిరిగారు. మూడో స్థానంలో వచ్చిన రిక్కీ భుయ్ 87 బంతుల్లోనే 10 బౌండరీలు, 3 సిక్సర్లతో 90 పరుగులు సాధించి, ఆకాష్ సేన్ గుప్తా(28)తో కలిసి క్రీజులో ఉన్నారు. నిశాంత్ సింధు 5 పరుగులు చేయగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అర్ధ సెంచరీ సాధించారు. సంజు శ్యాంసన్ 45 పరుగులు చేసి ఔట్ అయ్యారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-డి జట్టు 44 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 244 పరుగులు సాధించింది. ఆధిక్యం 311 పరుగులకు చేరింది. చేతిలో మరో ఐదు వికెట్లు ఉన్నాయి. రెండు మ్యాచ్‌లు డ్రా అయ్యే అవకాశం ఉంది.

సజావుగా బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం సిటీ, సెప్టెంబరు 21: జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 139మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శనివారం స్థానిక జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ సజావుగా సాగింది. ట్రైనీ కలెక్టర్ వినూత్న ఆధ్వర్యంలో ఆశాఖ ఎస్ఈ కేవీకేవీ ప్రసాద్, ఈఈ చంద్రశేఖర్, డీఈఈలు రాజేంద్రప్రసాద్, గురుమూర్తిరాజు తదితర అధికారులు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి బదిలీలు నిర్వహించారు. మొత్తంగా 139 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకోగా.. 78మందికి ఖాళీలు లేకపోవడంతో పాత స్థానాల్లోనే ఉండనున్నారు. ఆరుగురు శ్రీ సత్యసాయి జిల్లాకు, మిగిలిన వారికి బదిలీలు జరిగాయి.

పన్నుల శాఖలో..

అనంతపురం క్రైం, సెప్టెంబరు 21: పన్నుల శాఖలో పలువురు ఉద్యోగుల బదిలీలు శనివారం జరిగాయి. డీసీటీఓలు, ఏసీటీఓలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ల బదిలీలు జరిగాయి. డీసీటీఓ సుజాతను అనంతపురం 2వ సర్కిల్‌కు, జేసీ కార్యాలయానికి డీసీటీఓ సుబ్బన్నను నియమించారు. సీనియార్టీ ఆధారంగా సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు జరిగాయి.

1.658 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, సెప్టెంబరు 21: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 918 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 878 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.658 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

నేడు ప్రైవేట్ స్కూళ్ల అసోసియేషన్ సమావేశం

అనంతపురం విద్య, సెప్టెంబరు 21: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(ఏడీపీఎస్ఏ) సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సీఆర్వో రవిచంద్రారెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని రఘు సైనిక్ స్కూల్‌లో రెండు జిల్లాల్లోని పాఠశాలల కరస్పాండెంట్లు, యూనియన్ నాయకులతో సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కొత్త కమిటీలను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీగా విజయలక్ష్మి బాధ్యతలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 21: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీగా విజయలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న మాధవిని ఏలూరు డీఐజీగా బదిలీ చేస్తూ... ఆమె స్థానంలో విజయనగరం డీఐజీగా పనిచేస్తున్న విజయలక్ష్మిని నియమించారు. బాధ్యతలు చేపట్టిన డీఐజీని అనంతపురం, రూరల్ సబ్ రిజిస్ట్రార్లు ఇస్మాయిల్, టీజీ రెడ్డి, ఇతర సబ్‌రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అంతా గందరగోళం

- బదిలీల కౌన్సెలింగ్‌లో పంచాయతీ సిబ్బంది ఇబ్బంది

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 21: జిల్లా పంచాయతీల్లోని గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల బదిలీల కోసం శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. అభ్యర్థులకు కౌన్సెలింగ్ కోసం డేట్స్ ఇస్తామని చెప్పిన ఉన్నతాధికారులు ఉన్నఫలంగా మేసేజ్ చేసి వెంటనే హాజరు కావాలని చెప్పడంతో ఉమ్మడి జిల్లా సరిహద్దు మండలాల నుంచి కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సిబ్బంది ఇబ్బంది పడ్డారు. జేసీ శివనారాయణ శర్మ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో కౌన్సెలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. అంతకుముందే అక్కడ మహిళా పోలీస్‌లకు కౌన్సెలింగ్ ప్రారంభించారు. అది ఆలస్యం కావడంతో వేదికను మినీ సమావేశ భవనంలోకి మార్చారు. ఎవరు కౌన్సెలింగ్‌కు రావాలి, ఎవరు వద్దు అన్నది స్పష్టత లేకపోవడంతో రెండు జిల్లాల అభ్యర్థులు ఒకేసారి కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. దీంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. అధికారులు మాత్రం వారు తయారు చేసుకున్న జాబితాకు అనుగుణంగా ప్రతి 50 మందికి ఒకసారి కౌన్సెలింగ్ నిర్వహించేలా ప్లాన్ చేశారు. మొదటి 50 మంది ఎవరన్నది కూడా అర్థంకాని పరిస్థితి. చంటి బిడ్డలతో కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి తొలుత కౌన్సెలింగ్ నిర్వహించి వారు వెళ్లేలా జేసీ చొరవ చూపారు. ఇది మినీ సమావేశ భవనంలోకి వచ్చిన వారికి మాత్రం వర్తించింది. బయట చిన్నపిల్లలతో ఇబ్బంది పడుతున్న వారికి సమాచారం అందించేవారు లేకపోవడంతో వారికి తిప్పలు తప్పలేదు. ఆరు నెలలలోపు చిన్నపిల్లలున్న వారికి వెసులుబాటు కల్పించి బదిలీలకు ఓకే చెప్పారు. అనంతరం స్పౌజ్‌కు, మ్యూచువల్ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అనారోగ్య సమస్యలు చెప్పిన వారికి మాత్రం ప్రసక్తే లేదన్నారు. సాయంత్రం 4గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభించారు. సర్టిఫికెట్ల పరిశీలనలో డీపీఓ ప్రభాకర్‌రావు, పుట్టపర్తి ఇన్‌చార్జ్ డీపీఓ శివకుమారి, డీఎల్‌పీఓ సుమన జయంతి, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుగూళ్ల ఉత్పత్తిని పెంచుదాం: ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 21: పట్టుగూళ్ల ఉత్పత్తిని పెంచి ప్రపంచంలోనే దేశం అగ్రగామిగా నిలిచేలా కృషి చేస్తామని అనంతపురం ఎంపీ, కేంద్ర సిల్క్ బోర్డు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బెంగళూరులోని గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో శనివారం కేంద్ర పట్టు మండలి ప్లాటినం జూబ్లీ ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పట్టు రైతులు, రీలర్స్, వీవర్స్, రీలింగ్ యూనిట్ల వారిగా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మల్బరీ షెడ్ల నిర్మాణం కోసం రుణసదుపాయాన్ని రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతోపాటు సబ్సిడీని పెంచాలన్నారు. గతంలో టీడీపీ హయంలో అందించిన రూ.50ల ఇన్సెంటీవ్‌ను రూ.150లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ నిర్మాణం కోసం మొదటి దశలో రూ.8 కోట్లు మంజూరు చేశారని, ఇందుకు కేంద్ర జౌళి శాఖ మంత్రికి ఎంపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రెండో దశ పనులు చేపట్టేందుకు రూ.12 కోట్లను మంజూరు చేసి పూర్తి స్థాయిలో పట్టు గూళ్ల మార్కెట్‌ను ఆధునికీకరించాలని కోరారు.

రైఫిల్ షూటింగ్‌లో తీక్షన్‌సాయికి సిల్వర్ మెడల్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 21: నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని నిర్వహించిన రైఫిల్ షూటింగ్‌లో తీక్షన్‌సాయికి రజత పతకం దక్కింది. ఇటీవల రామ్‌నగర్‌లోని ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో అండర్-14 బాలుర విభాగంలో తీక్షన్‌సాయి ప్రతిభ చాటాడు. స్థానిక కోర్టురోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబుస్సుమ్ చేతుల మీదుగా విజేతకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ శ్రీకాంత్, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

రండి అభివృద్ధిని చూపిస్తాం: ఎమ్మెల్యే పరిటాల సునీత



కురుగుంటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, సెప్టెంబరు 21: వంద రోజుల్లో రాప్తాడు నియోజకవర్గానికి ఏం చేశారంటూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, ఓ పత్రిక ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, నియోజకవర్గానికి వస్తే ఏం చేశామో చూపిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత సవాల్ విసిరారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె మండలంలోని కురుగుంట, పాపంపేట, కక్కలపల్లి కాలనీ, ఆకుతోటపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయాగ్రామాల్లో రూ.3.25కోట్లతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కురుగుంటలో పరిటాల శ్రీరామ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్‌కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..వంద రోజుల్లో రూ.25కోట్లు తీసుకొస్తే దానిపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రకాష్‌రెడ్డి ఏనాడైనా అభివృద్ధి గురించి ఆలోచిస్తే కదా అంటూ మండి పడ్డారు. సైకో జగన్ రెడ్డి అన్న క్యాంటీన్లు మూసివేస్తే..చంద్రబాబు వాటిని తిరిగి ప్రారంభించారన్నారు. మెగా డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన వైపు అడుగులు పడ్డాయన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

బుక్కరాయసముద్రం సెప్టెంబరు21: బీహార్ రాజధాని పాట్నాలో ఎన్ఐటీలో ఇంజనీరింగ్ చదువుతున్న పల్లవిరెడ్డి(20) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బుక్కరాయసముద్రం పంచాయతీలో కొట్టాలపల్లి గ్రామానికి చెందిన రామ కృష్ణారెడ్డి రెండో కుమార్తె పల్లవిరెడ్డి పాట్నాలో ని ఎన్ఐటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం సాయంత్రం హాస్టల్ గదిలో నే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉన్నత చదువులు చద వడానికి పాట్నా వెళ్లిన తమ కుమార్తె శవమై తిరిగి వస్తోందని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

జగన్ అండ్ టీంను వదిలేదిలేదు

● ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, సెప్టెంబరు 21: తిరుమల లడ్డూని కలుషితం చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండ్ టీంను ఎట్టి పరిస్థితిలోను వదిలేదని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని పాపంపేట గ్రామంలో శనివారం నిర్వహించిన మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్ అధికారం ఉన్న సమయంలో తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ తయారీలో పశువుల కొవ్వుతో తయారు చేసిన నూనె వాడినట్లుగా తెలుస్తోందన్నారు. ఇది కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. దీనిపై ఎన్డీఏ ప్రభుత్వ పెద్దలు పూర్తిస్థాయిలో విచారణ చేయించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పాపంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ఫలితం అనుభవిస్తారు: దగ్గుపాటి

అనంతపురం అర్బన్: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో పశువుల కొవ్వుతో తయారైన నూనెను వినియోగించి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన జగన్‌రెడ్డి అండ్ టీం ఫలితం అనుభవిస్తారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. శనివారం స్థానిక 41వ డివిజన్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... తిరుమల లడ్డూ తయారీలో పశువుల కొవ్వు నుంచి తీసిన ఆయిల్ వాడకంపై విచారణ జరుగుతోందని, ఈ ప్రభుత్వం నుంచి, వెంకటేశ్వరస్వామి నుంచి తప్పుచేసిన ఎవరూ తప్పించుకోలేరన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ హరిప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే సుపరిపాలన: ఎమ్మెల్యే శ్రావణి

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. మండలంలోని సంజీవపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాలుగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇది మంచి ప్రభుత్వమని, మనందరి ప్రభుత్వమన్నారు. సంక్షోభం నుంచి సంక్షేమం వైపు రాష్ట్రం పరుగులు పెడుతోందన్నారు. రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నా సంక్షేమాన్ని విస్మరించకుండానే కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పసుపుల హనుమంతురెడ్డి టిడిపి నేతలు మల్లికార్జునరెడ్డి రవీంద్ర గోవిందరెడ్డి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫెక్షన్ సోకిన విద్యార్థికి డీఎంహెచ్ఓ పరామర్శ

అనంతపురం టౌన్, సెప్టెంబరు 21: సూది మందు వల్ల ఇన్ఫెక్షన్ సోకి, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డిగ్రీ విద్యార్థి ప్రవీణ్‌ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈ.బి.దేవి పరామర్శించారు. జ్వరానికి చికిత్స పొందిన ఓ విద్యార్థికి వచ్చిన కష్టాల గురించి భార్యా భర్తల వైద్యం, విద్యార్థికి సంకటం శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితమైంది. ఈఘటనపై కలెక్టరు వినోద్‌కుమార్ సీరియస్‌గా స్పందించి, వైద్యాధికారులను వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీంతో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బి.దేవి డెమోలు త్యాగరాజు, గంగాధర్‌తో కలిసి విద్యార్థికి ఆపరేషన్ జరిగి చికిత్స పొందుతున్న ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ బాధిత విద్యార్థి ప్రవీణ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సంఘటనకు సంబంధించిన మొత్తం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ చేసిన డాక్టర్ మాధవరావుతోను మాట్లాడారు. తర్వాత ఆవిద్యార్థికి జ్వరానికి వైద్యం అందించిన డాక్టర్ సుహాసిని వద్దకు వెళ్లారు. ఎస్కేయూ హెల్త్ యూనిట్‌లో పని చేసి రిటైర్డ్ అయ్యానని, తాను ఉంటున్న ఇంటిలోనే క్లినిక్ నిర్వహిస్తున్నట్లు సుహాసిని డీఎంహెచ్‌ఓకు వివరించారు. దీనిపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యానికి సంబంధంలేని మీభర్తతో ఎలా ఇంజక్షన్ వేయిస్తారని మండిపడ్డారు. మీనిర్వాకం వల్ల ఆ పిల్లోడికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ప్రశ్నించారు. ఇందుకు డాక్టర్ సుహాసిని స్పందిస్తూ పొరపాటు జరిగిందని, తాను ఇక్కడ ఆస్పత్రి నడపడం లేదని, చుట్టుపక్కల వారు ఎవరైనా వస్తే చూస్తుంటానని చెప్పారు. అలాగే ఆవిద్యార్థి ఆపరేషన్‌కు అయిన ఖర్చును తాను భరిస్తానని ఒప్పుకున్నారు. దీనికి బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో సమస్యకు తెరపడింది.

ఆధునిక సాహిత్య వైతాళికుడు గురజాడ

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 21: ఆధునిక సాహిత్య వైతాళికుడు గురజాడ అప్పారావు అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురజాడ అప్పరావు 162వ జయంతిని పురస్కరించుకుని ఐద్వా, ఎస్ఎస్‌బీఎన్ తెలుగుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సంస్మరణ సభ నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కార్యదర్శి నిర్మలమ్మ, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ అంకె శ్రీనివాసులు, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దేవకి ముఖ్యఅతిథులుగా హాజరై గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య రాచపాళెం మాట్లాడుతూ వేల సంవత్సరాలపాటు కొనసాగిన సంప్రదాయ సాహిత్యం తీరును గురజాడ బద్దలు కొట్టారని తెలిపారు. కార్యక్రమంలో రచయిత షేక్ రియాజుద్దీన్, ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక, ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, మాధవి పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 21: మండల కేంద్రంలోని కొత్త బీసీ కాలనీలో శనివారం ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందింది. ఆమె బంధువులు తెలిపిన మేరకు...పుట్టపర్తి మండలం కొట్లపల్లికి చెందిన ఎరికల సునీతమ్మ(35)కు చెన్నేకొత్తపల్లికి చెందిన ఎరికల శంకర్‌తో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి పావని అనే నాలుగేళ్ల కుమార్తె ఉంది. కొంత కాలంగా భార్యభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో సునీతమ్మ పలుమార్లు పుట్టింటికి వెళ్లింది. నెలన్నర కిందట వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు, పెద్దల సమక్షంలో సర్దిచెప్పి పంపించారు. అయినా భర్త ప్రవర్తన నచ్చక అదే రోజు ఆమె పుట్టింటికి వెళ్లింది. బంధువులు, పెద్దల జోక్యంతో ఐదు రోజుల కిందట పుట్టినిం టి నుంచి చెన్నేకొత్తపల్లికి వచ్చింది. అయితే తన భార్య గుండెపోటుతో మృతి చెందిందని భర్త శంకర్ గ్రామంలోని పలువురికి శనివారం మధ్యాహ్నం ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. వారు విషయాన్ని పోలీసులకు చేరవేశాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనాస్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. సునీత మృతి అనుమా నాస్పదంగా ఉండటంతో భర్త శంకర్‌ను అదుపు లోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతు రాలి తల్లి రామక్క, బంధువులు చెన్నేకొత్తపల్లికి చేరుకుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. తన బిడ్డను భర్త శంకరే చంపేశాడని తల్లి ఆరోపించింది. బంధువులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శ్రీధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుం టామని వారు తెలిపారు.



సునీతమ్మ(ఫైల్)

మేయర్ వసీం ఒక రబ్బరు స్టాంప్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 21: మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి నగర మేయర్ వసీం ఒక రబ్బరు స్టాంప్ లాంటివాడని టీడీపీ నాయకులు మండిపడ్డారు. శనివారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో నాయకులు లక్ష్మీనరసింహ, పోతుల లక్ష్మీనరసింహులు, స్వామిదాస్‌లు మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే అనంత మాటలు చెబుతూ కాలం వెళ్లదీశారన్నారు. శివకుమార్, సాదిక్ వలి, హరి, శీన పాల్గొన్నారు.

నేడు అర్బన్‌బ్యాంకు 108వ మహాజన సభ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 21: ది అనంతపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 108వ మహాజనసభను స్థానిక సుభాష్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, సీఈఓ విజయభాస్కర్ తెలిపారు. ఆడిట్ నివేదిక, ఖర్చుల వివరాలు, నికర లాభాన్ని పంపిణీ చేయడంపై చర్చిస్తామన్నారు.

ఇళ్ల నిర్మాణంపై శ్రద్ధ పెట్టండి

అనంతపురం టౌన్: నిరుపేదల ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి చేయాలని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో హౌసింగ్‌పై శనివారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమాలను షెడ్యూల్ మేరకు నిర్వహించాలన్నారు. వందరోజుల గవర్నెన్స్, స్వచ్ఛతాహి సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శైలజ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ హసేన్ బాషా, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ

ఉరవకొండ, సెప్టెంబరు 21: మండలంలోని పెన్న హోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 21: పట్టణంలోని దోనిముక్కల రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పామిడి పెన్నా నది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తుండగా దోనిముక్కల రోడ్డులో రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప పట్టుకున్నారు. అనంతరం వాటిని స్టేషన్‌కు తరలించారు.

కంప్యూటర్ల వితరణ

కూడేరు, సెప్టెంబరు, 21: మండలంలోని ఇప్పేరు గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రీన్ కో ఎనర్జీ సంస్థ వారు రూ. లక్షన్నర విలువ చేసే మూడు కంప్యూటర్లను వితరణ చేశారు. కంపెనీ ప్రతినిధులు శనివారం ఎస్ఎంసీ ఛైర్మన్ పెద్దిరాజు, హెచ్ఎం రామాంజనేయులకు కంప్యూటర్లను అందించారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడానికి కంప్యూటర్లు ఎంతో ఉపయోగపడతాయని హెచ్ఎం తెలిపారు.

పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

ఉరవకొండ, సెప్టెంబరు 21: పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని తహసీల్దారు మహబూబ్‌బాషా శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని డీటీడబ్ల్యూవో అధికారులు కోరారని, దీంతో పట్టణ శివారులోని సర్వే నెంబర్ 629బీలో 2.68ఎకరాల స్థలం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మండల సర్వేయర్ రత్నాకర్, ఆర్ఐ రామకృష్ణ, సచివాలయ సర్వేయర్ రాందాస్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా హారున్ రషీద్

ఉరవకొండ, సెప్టెంబరు 21: ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఉరవకొండకు చెందిన హారున్ రషీద్ ఎన్నికైయ్యారు. కళ్యాణదుర్గంలో ఈ నెల 19, 20వతేదీల్లో నిర్వహించిన జిల్లా మహాసభల్లో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఇందులో హారున్ రషీద్‌ను జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 21: కళ్యాణ్ డివిజన్ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ సబ్ డివిజనల్ లెవెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయుటకు అర్హత గల షెడ్యూల్డ్ క్యాస్ట్, షెడ్యూల్డ్ ట్రైబ్స్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆర్డీఓ రాణి సుస్మిత శనివారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోపు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

శివాలయంలో చోరీ

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 21: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న శివాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గుర్తుతెలియని దుండగులు శుక్రవారం రాత్రి ఆలయంలోకి చొరబడి హుండీ పగులగొట్టి నగదు చోరీ చేసినట్లు చెప్పారు. గత రెండు నెలల నుండి హుండీ లెక్కింపు జరగలేదని, అందులో ఉన్న నగదును దొంగచారని తెలిపారు. నగదు ఎంత చోరీ అయిందనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

పేకాటరాయుళ్ల అరెస్టు

కూడేరు, సెప్టెంబరు 21: మండలంలోని అరవకూరు గ్రామ సమీపంలో శనివారం పేకాట స్థావరంపై సీఐ శివరాముడు, సిబ్బంది దాడులు చేశారు. ఇందులో పేకాటాడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.26,450 నగదుతోపాటు 8 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

మహిళ ఆత్మహత్య

పుట్లూరు, సెప్టెంబరు 21: మండలంలోని బాలాపురం గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామంలోని తలారి పెద్దయ్య కుమార్తె రేణుకకు (28) నాలుగేళ్లక్రితం ఇదే గ్రామానికి చెందిన గురుదేవ్‌తో వివాహం జరిగింది. కొద్దిరోజుల తర్వాత ఆమె కుటుంబ కలహాల వల్ల భర్తకు దూరమై తండ్రి వద్దనే ఉంటోంది. గతవారం తన అమ్మమ్మ ఊరు అయిన కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామానికి వెళ్లింది. ఆరోగ్యం బాగాలేకపోవడంతో జీవితం మీద విరక్తి చెందిన ఆమె శుక్రవారం రాత్రి అక్కడే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ హేమాద్రి శనివారం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన బాలాపురానికి తరలించారు. తండ్రి పెద్దయ్య ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి..

తాడిపత్రి, సెప్టెంబరు 21: మండలంలోని పెద్దపొలమడ గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శనివారం ఇదే గ్రామానికి చెందిన మల్లికార్జున (45) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. మల్లికార్జున వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తిచెందిన ఆయన రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య నిర్మల, ముగ్గురు కుమారులు ఉన్నారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఆయన చెప్పారు.

డిప్యూటీ సివిల్ సర్జన్‌కు సన్మానం

ఉరవకొండ, సెప్టెంబరు21: పట్టణంలోని సీహెచ్‌సీ డిప్యూటీ సివిల్ సర్జన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటస్వామి చౌదరిని టీడీపీ నాయకులు ప్యారం కేశవానంద, గోవిందు ఘనంగా సన్మానించారు. ఆస్పత్రిలో శనివారం వారు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిమాసి రవీంద్ర, సత్తిరెడ్డి, దేవాంగ ఉద్యోగుల సంఘం నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.


వైద్యుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు


బొచ్చుపల్లిలో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


పామిడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


జుంజురాంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

చంద్రబాబు చేతల ముఖ్యమంత్రి

● ఇది మంచి ప్రభుత్వంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం(శెట్టూరు)/ బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 21: చంద్రబాబుతో చేతల ముఖ్యమంత్రి అని, ఇది వందరోజుల పాలనలో నిరూపణ అయిందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయినందున శెట్టూరు మండలం బొచ్చుపల్లి గ్రామంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ స్టిక్కర్లను విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లకు మొండిచేయి చూపిందన్నారు. అదే కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే పంచాయతీలకు నిధులిచ్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేసిందన్నారు. అలాగే పింఛన్‌దారులకు పింఛన్ పెంచిందని, ఉద్యోగులకు ఒకటోతారీఖునే జీతాలు అందిస్తోందని, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ విడుదల చేసిందని, పేదల ఆకలి తీర్చేందుకు రూ.5కే భోజనం పెట్టేందుకు అన్నా క్యాంటీన్లను ప్రారంభించిందని తెలిపారు. ఇక దీపావళి నాటికి ఉచిత గ్యాస్ సిలిండర్ ఇవ్వవనున్నారని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో నియోజకవర్గంలో బీటీపీ కాలువ పూర్తి చేస్తామని, గ్రామాలకు రోడ్లు వేస్తామని, వేయడం, మౌలిక వసతులు కల్పిస్తామని, రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించి ఆదుకుంటామని అన్నారు. తర్వాత రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి ఉలవలను పంపిణీ చేశారు. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేశారు. అలాగే బ్రహ్మసముద్రం మండలం సంతే కొండాపురంలో సర్పంచ్ వనిత మల్లికార్జున అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేని పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలోనే ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని, మంచి ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుందని తెలిపారు.

వందరోజుల్లోనే ఎంతో అభివృద్ధి చేశాం : ఎమ్మెల్యే జయరాం

పామిడి: కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిందని, ఈ కొద్ది కాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేసి చూపామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయనతో పాటు టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, మండల ప్రత్యేకాధికారి అప్పాజీ, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ ప్రభాకర్, ఏఓ లీనావసుంధర, వైస్ ఎంపీపీ కాయల మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు కన్నా ఈ కూటమి ప్రభుత్వంలో వంద రోజుల్లో టీడీపీ ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధే ఎక్కువ అన్నారు. ప్రతి మండలంలోనూ రూ. 5కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అనంతరం కౌలురైతు లక్ష్మీదేవికి గుర్తింపు కార్డును అందజేశారు. అలాగే సుంకిరెడ్డికి భూసార పరీక్ష పత్రం అందజేశారు. సఫాయి కార్మికులకు కాస్మొటిక్స్ అందజేశారు. ముందుగా అంబేడ్కర్ సర్కిల్ నుంచి స్వచ్ఛతా హి సేవ ర్యాలీ చేపట్టారు. ఈఓఆర్డీ శశికళ, ఈఓ చంద్రశేఖర్, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం: ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని జుంజురంపల్లి గ్రామంలో సర్పంచ్ వన్నూరుస్వామి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమ పథకాలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అదే కూటమి ప్రభుత్వం వచ్చాక వందరోజుల్లోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందాయన్నారు. త్వరలోనే ఆడబిడ్డ నిధి కింద మహిళలకు రూ.1500 అందిస్తామని, దీపావళికి ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తామని, ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని తెలిపారు. ఇక నియోజకవర్గంలో కణేకల్లు బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా చూస్తామని అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మంజునాథగౌడ్, టీడీపీ కన్వీనర్లు హనుమంతు, హనుమంతరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రంగనాయకులు, సర్పంచ్‌లు వన్నూరుస్వామి, రాజశేఖర్‌రెడ్డి, మల్లేశప్ప, నాయకులు పాల్గొన్నారు.

ఊరూరా 'ఇది మంచి ప్రభుత్వం'


గుత్తిలో ఇది మంచిప్రభుత్వం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్, టీడీపీ నాయకులు

తాడిపత్రి, సెప్టెంబరు 21: మండలంలోని మండలంలోని చిన్నపొలమడ, పెద్దపొలమడ గ్రామాల్లో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లావణ్య , పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వందరోజుల్లో ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే కరపత్రాలు అందజేశారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నారని తెలిపారు. వందరోజుల్లోనే కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రవిమోహన్, నిర్మలానందరెడ్డి, మండల ఇంజనీర్ లక్ష్మీదేవి, పంచాయతీ సెక్రెటరీ శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్, ఆసుపత్రిపాలెం, సంజీవనగర్, నందలపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్లు మల్లికార్జున, రేష్మాపర్వీన్, విజయ్‌కుమార్, జింకా లక్ష్మీదేవి, షెక్షావలి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండలంలోని రాయలచెరువు, నగరూరు, బోయరెడ్డిపల్లి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని కొండుగారికుంట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి పెద్దన్న, టీడీపీ నాయకులు భక్తవత్సల, బాబు, చౌదరి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, పెద్దయక్కలూరు, చిన్నయక్కలూరు, పెద్దయక్కలూరు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచులు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

ఉరవకొండ: నియోజకవర్గంలోని లత్తవరం, చిన్నహోతూరు, తట్రగల్లు, కొనకొండ్ల గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు బ్యాళ్ల ఈశ్వరయ్య, మోహన్, లీలాధర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో 8వ సచివాలయ పరిధిలో గల 15, 16వ వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి , దిల్కాశీనా, సుంకన్న, చికెన్ శీనా, టైలర్‌బాష, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గుత్తిరూరల్ : మండలంలోని బేతాపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ బర్డీవలి, ఎంపీటీసీ ధనుంజయ, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు సాంబ శివయాదవ్, మాజీ సర్పంచ్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ : మండలంలో కొళగానహళ్లి, కురవళ్లి, చంద్రగిరి గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ షణ్ముఖయ్య, టీడీపీ నాయకులు ప్రభాకర్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, వీఆర్వో హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీ.హీరేహాళ్: మండలంలోని హీరేహాళ్, నాగలాపురం, పులకుర్తి, మల్లికేతి తదితర గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు ,మాజీ ఎంపీపీ పుష్పావతి, మాజీ జడ్పీటీసీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి


గుత్తి, సెప్టెంబరు 21: మహాకవి, సంఘసంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ కార్యదర్శి కుళ్లాయిబాబు, సభ్యులు లక్ష్మీనారాయణ, స్వర్ణాంబ, కృష్ణవేణి, నారాయణరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అర్థశాస్త్ర ఉపన్యాసకుడు అయ్యన్న , అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకుల సమస్యలను పరిష్కరించాలి

గుత్తి, సెప్టెంబరు21: ఢిల్లీలో జరిగిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ జనరల్ బాడీ సమావేశంలో శనివారం గుత్తి పట్టణంలోని ది గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఛైర్మన్ అబ్దుల్ జిలాన్ పాల్గొన్నారు. అర్బన్ బ్యాంక్‌లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆయన అక్కడ ప్రస్తావించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బంగారం రుణాలపై ప్రస్తుతం ఇస్తున్న బుల్లెట్ పేమెంట్‌ను రూ. 4లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలన్నారు. అదే విధంగా డీఐసీజీసీ ప్రీమియంను ప్రతి వంద రూపాలయకు రూ.12పైసలు వసూలు చేస్తున్నారన్నారు. దీనిని రూ.8పైసలకు తగ్గించాలని కోరారు. దీంతో పాటు పలు అంశాలను ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గిరినాథ స్వామి జలధి


గంగాజల కలశంతో ఊరేగింపుగా వస్తున్న పూజారి

బెళుగుప్ప, సెప్టెంబరు 21: మండలంలోని ఎర్రగుడిలో గిరినాథస్వామి జలధి పూజోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో పూజారి స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ శివారులోని పెద్ద వంక నీటిలో గంగపూజ చేసి తర్వాత గంగా జలాన్ని కలశంతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. గంగ జల కలశం ఆలయానికి చేరుకోగానే భక్తులు పూజారిని పలు కోర్కెలు కోరి ఏమేవి నెరవేరుతాయో, ఏయే పంటలు బాగా పండుతామో అడిగి తెలుసుకున్నారు. తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగం, అన్నదానం జరిగింది. రాత్రికి భజనలతో జలధి పూజోత్సవం ముగిసింది.

శ్రీవారి లడ్డూను అపవిత్రం చేశారు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 21: తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని గత వైసీపీ ప్రభుత్వం కాసులకు కక్కుర్తి పడి జంతువుల కొవ్వుతో తయారు చేసి అపవిత్రం చేసిందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మండిపడ్డారు. శెట్టూరు మండలం బొచ్చుపల్లిలో శనివారం ఆయన మాట్లాడారు. బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి పవిత్రతను వైసీపీ నాయకులు మంటగలిపారని, ఆ దేవుడే వారికి బుద్ధి చెబుతారని ఆయన అన్నారు.

కణేకల్లు: తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కలిపి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు మండల కేంద్రంలో తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు దత్తా తిప్పేస్వామి, రమేష్, రుద్ర, వినోద్, సిద్దు, మణికంఠ, మనోజ్, హనుమంతరెడ్డి, వంశీ పాల్గొన్నారు.

కూడేరు: శ్రీవారి లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ జరిపించాలని నాయీబ్రహ్మణ సంఘం ఉరవకొండ మండల కన్వీనర్ కడదరకుంట నాగరాజు డిమాండ్ చేశారు. కూడేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలకులు టీటీడీని అపవిత్రం చేశారని మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతిసే విధంగా జగన్ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. తక్షణమే సీబీపీ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని ఆయన కోరారు.

కేన్సర్ పీడితురాలికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 21: పట్టణానికి చెందిన జ్యోత్స్న అనే మహిళ గత కొంతకాలంగా బోన్ కేన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. స్థానిక ప్రజావేదిక వద్దకు శనివారం బాధితురాలి తల్లిదండ్రులను రప్పించి నగదును అందజేశారు.

తడి, పొడి చెత్తను వేరు చేసే మిషన్ ప్రారంభం

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని డంపింగ్ యార్డు వద్ద చెత్తను రీసైక్లింగ్ చేసి తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మంజూరైన లెగసీ వేస్ట్ క్లియరెన్స్ మిషన్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలు విలువ చేసే ఈ మిషన్‌ను ప్రత్యేకంగా మున్సిపాలిటీకి మంజూరు చేయించామన్నారు. దీంతో తడి, పొడి చెత్తను వేరుచేసి వాటి ద్వారా సంపద సృష్టించేందుకు వీలు పడుతుందన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

బొమ్మనహాళ్, సెప్టెంబరు 21: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి మండల సీపీఎం హమాలీ యూనియన్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు శనివారం ఘన నివాళులర్పించారు. ఉద్దేహాళ్ గ్రామంలో హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకుడు ఓబుళేసు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి శ్రామిక లోకానికి సీపీఎంకు తీరని లోటన్నారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 21: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు వేకువజామునే సుప్రభాతసేవ చేసి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, వెండి కవచం పుష్పాలతో అలంకరించారు. విష్ణు పారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. తర్వాత మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిదర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు పొందారు.


ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బడేషావలి దర్గాలో మంత్రి ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

విడపనకల్లు, సెప్టెంబరు 21: మండలంలోని వీ కొత్తకోటలో జరుగుతున్న బడేషావలి ఉరుసులో ఆర్థిక మంత్రి మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక దర్గాలో ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ తిమ్మరాజు, టీడీపీ నాయకులు రంగస్వామి, ఖాదర్ భాషా, నబీసాబ్ తదితరులు ఉన్నారు. ఉరుసు సందర్భంగా దర్గా ప్రాంగణంలో నిర్వాహకులు ఖవ్వాలి నిర్వహించారు.

ఘటనా స్థలం పరిశీలన

ఆంధ్రజ్యోతి స్పందన

యల్లనూరు, సెప్టెంబరు 21: మండలకేంద్రంలోని అట వీ ప్రాంతంలో శ్రీగంధం చెట్లు నరికివేసిన ప్రదేశాన్ని అటవీ అధికారులు, పోలీసులు శనివారం పరిశీలించారు. శ్రీ గం ధం చెట్లు నరికివేతకు గుర వడంపై శనివారం ఆంధ్రజ్యోతిలో వీరప్పన్‌లు ఎవరో అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అటవీఅధికారులు, పోలీసులు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ నరికి వదిలేసిన చెట్లతోపాటు దుండగులు వదిలేసిన గంధం మొక్కలను పరిశీలించారు. ఆ ప్రాంతంలోకి వచ్చిన వాహనాల జాడలను కూడా పరిశీలించారు. దుంగలను అపహరించిన వారు ఆరితేరిన వారై ఉంటారని, నాణ్యమైన దుంగలను మాత్రమే తీసుకు వెళ్లినట్లు తెలుస్తోందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అడవిపై నిఘా పెట్టడానికి పోలీసుల సహకారం తీసుకుంటున్నట్లు సెక్షన్ ఆఫీసర్ జగన్నాథం తెలిపారు. పరిశీలించిన వారిలో యల్లనూరు ఏఎస్ఐ సంపత్, ఫారెస్ట్ గార్డు సుధాకర్ ఉన్నారు.

కబ్జాలకు పాల్పడితే సహించం

రాయదుర్గం, సెప్టెంబరు 21: పట్టణంలో భూకబ్జాదారుల ఆటలు సాగనివ్వమని, ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. స్థానిక 7వ వార్డులో శనివారం ఆయన పర్యటించారు. పొట్టి శ్రీరాములు పాఠశాల వెనుకవైపు రోడ్డు స్థలం ఆక్రమణ చేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన రోడ్డు ఆక్రమణ చేస్తూ ప్లాటు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని ఆదేశించారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాల జోలికి వచ్చినా, మున్సిపాలిటీ స్థలాలను ఆక్రమించాలని చూసినా ఉపేక్షించమని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

రాయదుర్గంరూరల్: మండలంలోని జుంజురంపల్లి గ్రామంలో గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రూ. 2.30 లక్షల వ్యయంతో గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీలో వైసీపీ మద్దతు సర్పంచ్ చేరిక

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 21: మండలంలోని మలపనగుడి గ్రామపంచాయతీ వైసీపీ మద్దతు సర్పంచ్ రుద్రేశ్ టీడీపీలోకి చేరారు. రాయదుర్గం పట్టణంలోని ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు స్వగృహంలో శనివారం ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మండల కన్వీనర్ హనుమంతరెడ్డి , ఎంపీటీసీ మొండి మల్లికార్జున, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాల్యవివాహం.. నేరం


మాట్లాడుతున్న న్యాయాధికారి మంజుల

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 21: బాల్యవివాహాలు చేయడం, ప్రోత్సహించడం నేరమని గుంతకల్లు జూనియర్ సివిల్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయాధికారి మంజుల అన్నారు. స్థానిక 27వ వార్డులోని ఆచారమ్మ కొట్టాలలో గల పాండు రంగ స్వామి కల్యాణ మండపంలో శనివారం బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయాధికారి హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మైనార్టీ తీరకుండానే వివాహాలు చేస్తే అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంజి, కౌన్సిలర్ చాముండేశ్వరి, వన్‌టౌన్ సీఐ మనోహర్, మెప్మా సీఎంఎం భవాని, వైద్యురాలు స్వాతి, అంగన్‌వాడీ సూపర్‌వైజరు క్రిష్ణవేణి, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, మద్దికెర వెంకళ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవపై ర్యాలీ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 21: పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హి సేవపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ పరిసరాలను ప్రతిఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం భవాని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్


యాడికిలో కబడ్డీ మ్యాచ్‌లో తలపడుతున్న విద్యార్థినులు

యాడికి, సెప్టెంబరు 21: మండలకేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో శనివారం నిర్వహించిన బాలికల స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా సాగాయి. బాలికలకు సంబంధించి రన్నింగ్ రేస్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈపోటీల్లో మండలస్థాయిలో విజేతలను ఎంపికచేసినట్లు పీడీ ఓబులమ్మ తెలిపారు. వీరిని నియోజకవర్గస్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్‌కు పంపనున్నట్లు చెప్పారు. పీఈటీలు లోకేశ్వరి, బాబు, షణ్ముఖ, ప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలో వివిధ పాఠశాలల విద్యార్థులతో అండర్ - 14, 17 క్రీడాపోటీలను నిర్వహించారు. వీటిని ఎంఈఓ రామచంద్ర, ఎస్ఐ ఈశ్వరయ్య, హెచ్ఎం యోగేంద్రనాథ్, సర్పంచ్ విజయలక్ష్మి, విద్యాకమిటీ ఛైర్మెన్ యశోధర, ఆయా పాఠశాలల పీఈటీలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని బాలికోన్నత పాఠశాల గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ నిర్వహించారు. క్రీడాపోటీల మండల కో ఆర్డినేటర్ పీడీ శివశరణ, ఎంఈఓలు నాగమణి ,వెంకటరమేష్, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ప్రైవేట్ పాఠశాలల విరాళం

కణేకల్లు, సెప్టెంబరు 21: విజయవాడ వరద బాధితుల కోసం ప్రైవేట్ పాఠశాలల యాజమానులు విరాళం అందించారు. రాయదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును వారు ఆయన స్వగృహంలో కలిసి రూ. 3.40 లక్షలు చెక్కులను సీఎం సహాయనిధికి అందించారు. కణేకల్లుకు చెందిన విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ రూ.లక్ష, అయోధ్య విద్యాలయం రూ. 61 వేలు, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ రూ. 25 వేలు, అతావుల్లా స్కూల్ రూ. 23 వేలు, రాయదుర్గం వాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్ రూ. 20 వేలు, క్రీసెంట్ స్కూల్ రూ. 10 వేలు, బొమ్మనహాళ్ ప్రతిభ స్కూల్ రూ. 50 వేలు, కల్యం బాలమేధావి స్కూల్ రూ. 50 వేల చొప్పున చెక్కులు అందించారు. ప్రైవేట్ పాఠశాలల సంఘాల నాయకులు వన్నూరుస్వామి, రవికుమార్, అతావుల్లా, శ్రీనివాసులు, ప్రభంజనరెడ్డి, రామాంజనేయులు, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.